సాక్షి
శ్రీకాకుళం
శుక్రవారం । 18 । జూలై । 2025



ఇదేం పద్ధతి..?

టెక్కలి మేజర్ పంచాయతీలో నిధులు దోచుకోవడానికే అధికార పార్టీ కార్యకర్తలు చెప్పినట్లు అధికారులు అంచనాలను పెంచేశారంటూ వార్డు సభ్యులు మండిపడుతున్నారు. - 8లో



గంజాయి గుట్టురట్టు

అక్రమంగా తరలిస్తున్న గంజాయిని పోలీసులు పట్టుకున్నారు. ఒడిశాకు చెందిన ఇద్దరు వ్యక్తుల నుంచి 22.566 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. - 8లో

ఘనంగా ఆదిత్యుని క్షీరాభిషేకం

అరసవల్లి: ప్రత్యక్ష దైవం అరసవల్లి సూర్యనారాయణ స్వామి మూలవిరాట్టుకు గురువారం వేకువజామున క్షీరాభిషేక సేవ ఘనంగా జరిగింది. కర్కాటక సంక్రమణం దక్షిణాయన పుణ్య కాలాన ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మ ఆధ్వర్యంలో వేదమంత్రోచ్ఛారణల నడుమ ఈ సేవను పూర్తి చేశారు. సంప్రదాయ వస్త్రధారణలో వచ్చిన భక్తులకు మాత్రమే అనుమతించినట్లు ఈవో ప్రసాద్ తెలియజేశారు.

న్యూస్‌రీల్

రాష్ట్ర పండగగా బాలియాత్ర



కలెక్టర్‌కు వినతిపత్రం అందిస్తున్న కమిటీ ప్రతినిధులు

జలుమూరు: శ్రీముఖలింగంలో నవంబరు 9న జరగనున్న బాలియాత్రను ప్రభుత్వం రాష్ట్ర పండగగా నిర్వహించాలని బాలియాత్ర నిర్వహణ కమిటీ ప్రతినిధులు కోరారు. ఈ మేరకు గురువారం శ్రీకాకుళంలో కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌ను కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యుడు డాక్టర్ జీవితేశ్వరరావు మాట్లాడుతూ పార్టీలు, కులాలకు అతీతంగా అన్ని వర్గాల ప్రజలు యాత్రలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. త్వరలో అన్ని రాజకీయ పార్టీల నాయకులను కూడా కలిసి యాత్రకు సహకరించాలని కోరనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ టి.సతీష్‌కుమార్, ఎంపీటీసీ కె.హరిప్రసాద్, ఏఎంసీ చైర్మన్ టి.బలరాం, బి.వి.రమణ, హెచ్ మురళీమోహన్, అర్చకులు శేషాద్రి వెంకటాచలం, నాయుడుగారి జనార్దన్, పంచాది నారాయణమూర్తి, సూర శివ, సీపాన రాము, చింతాడ వెంకటరావు పాల్గొన్నారు.

పెచ్చులూడిన ఆస్పత్రి పైకప్పు



ఊడిపడిన శ్లాబ్ పెచ్చులు వద్ద ఆస్పత్రి సిబ్బంది

పొందూరు : పొందూరు ప్రభుత్వ సామాజిక ఆస్పత్రి పైకప్పు గురువారం పెచ్చులూడటంతో రోగులు భయంతో పరుగులు తీశారు. రోగులకు కొద్ది దూరంలో పెచ్చులు పడటంతో ప్రమాదమే తప్పింది. ఆస్పత్రి పక్కనే నూతన భవనం నిర్మాణం దాదాపు పూర్తి కావచ్చింది. అయితే బిల్లులు పెండింగులో ఉండటంతో జాప్యం జరుగుతోంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి నూతన భవనాన్ని ప్రారంభానికి సిద్ధం చేయాలని పలువురు కోరుతున్నారు.

పాత పెన్షన్ వర్తింపజేయాలి

శ్రీకాకుళం న్యూకాలనీ: కేంద్ర ప్రభుత్వం మెమో 57 ప్రకారం డీఎస్సీ 2003 ఉపాధ్యాయులకు పాత పెన్షన్ వర్తింపజేయాలని ఏపీ స్కూల్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తమ్మినాన చందనరావు, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సప్పటి మల్లేసు, పంచాది గోవిందరాజులు, నెమలపురి విష్ణుమూర్తి, రామిరెడ్డి గురువారం డిమాండ్ చేశారు. ఈ సమస్యపై ప్రభుత్వాలు ఉదాసీనంగా వ్యవహరించడం సరికాదన్నారు. ఈ న్యాయమైన డిమాండ్ సాధనకు ఈ నెల 18న అన్ని జిల్లా కేంద్రాల్లో జేఏసీ నిర్వహిస్తున్న నిరసన కార్యక్రమాలకు ఏపీ ఎస్‌టీఏ సంపూర్ణ మద్దతిస్తున్నట్టు పేర్కొన్నారు.

19న ప్లాస్టిక్ కాలుష్యంపై ప్రత్యేక డ్రైవ్



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్, జేసీలు

శ్రీకాకుళం పాతబస్టాండ్: 'స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర'లో భాగంగా ఈ నెల 19న జిల్లావ్యాప్తంగా ప్లాస్టిక్ కాలుష్య నిర్మూలనపై ప్రత్యేక డ్రైవ్ నిర్వహించాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధికారులను ఆదేశించారు. గ్రామ, వార్డు, మండల స్థాయిలో ప్రజల భాగస్వామ్యంతో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. ఈ మేరకు గురువారం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ అనంతరం కలెక్టర్ జిల్లా అధికారులకు సూచనలు చేశారు. ప్లాస్టిక్ వినియోగం వల్ల కలిగే నష్టాలపై విద్యార్థులకు అవగాహన కల్పించడానికి మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలు తమ పరిధిలోని ప్రభుత్వ పాఠశాలలను సందర్శించాలని ఆదేశించారు. ప్రభుత్వ కార్యాలయాల్లో ప్లాస్టిక్ బాటిళ్ల వాడకాన్ని తగ్గించే చర్యలు తీసుకోవాలని సూచించారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, అసిస్టెంట్ కలెక్టర్ దొనక పృథ్వీరాజ్ కుమార్, జిల్లా రెవెన్యూ అధికారి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

నిందితులకు స్వేచ్ఛ

అమాయకులకు శిక్ష!

• ప్రజాస్వామ్యంలో ఉన్నామా.. • రెడ్ బుక్ రాజ్యాంగంలో ఉన్నామా..

ఈ చిత్రం చూడండి. కాశీబుగ్గలో జరిగిన ఘటన ఇది. చిన్నబడాం గ్రామంలో మంగళవారం కొత్తమ్మ తల్లి చల్లదనం ఉత్సవంలో దాడికి పాల్పడిన వ్యక్తులను, దాడికి గురైన వ్యక్తులను వదిలేసి గొడవలతో సంబంధం లేని ముగ్గురు వ్యక్తులపై కేసు నమోదు చేశారు. రాత్రికి రాత్రే వారిని పోలీసు స్టేషన్‌కు తీసుకొచ్చేశారు. బాధిత కుటుంబాల మహిళలు పోలీసు స్టేషన్ వద్ద సీఐ సూర్యనారాయణ కాలు మొక్కి సక్రమంగా విచారణ చేపట్టి న్యాయం చేయాలని కన్నీళ్లు పెట్టుకున్నారు. ఇదే విషయమై పోలీసు స్టేషన్ ఎదుట మాజీ మంత్రి సీదిరి అప్పలరాజు ధర్నా చేశారు. కొట్లాటలో సంబంధం లేనివారిపై కేసులు పెట్టడమేంటని ప్రశ్నించారు. గ్రామాల్లో గొడవలు సృష్టించొద్దని సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌కు చేతులెత్తి నమస్కరిస్తూ ఆవేదన వ్యక్తం చేశారు.



- విస్మయం కలిగిస్తున్న పోలీసుల వ్యవహార శైలి
- ఒక్కో కేసులో ఒక్కో తీరు
- కాశీబుగ్గలో గొడవకు సంబంధం లేని ముగ్గురిపై కేసు నమోదు
- రాత్రికి రాత్రే పోలీసు స్టేషన్‌కు తీసుకొచ్చి ఉంచిన పరిస్థితి
- ఫరీదుపేటలో హత్య జరిగినా నిందితులపై కానరాని చర్యలు
- తాత్సారం చేయడంతో కీలక సూత్రధారి పరారీ



ఈ చిత్రం చూడండి. ఎచ్చెర్ల మండలం ఫరీదుపేటలో పట్టపగలు ఈ నెల 11న వైఎస్సార్‌సీపీ నాయకుడు సత్తారు గోపిని హత్య చేయడంతో మృతదేహంపై పడి వారి కుటుంబీకులు పోలీసుల తీరుపై ఆవేదన వ్యక్తం చేసిన దృశ్యమిది. గతేడాది కూన ప్రసాద్ హత్య జరిగినప్పుడే నిందితులపై కఠిన చర్యలు తీసుకుంటే ఈ హత్య జరిగేది కాదని, ఎస్‌ఐ సందీప్ తీరుపై కూడా మండిపడ్డారు. మృతదేహం దగ్గరకు ఎస్పీని సైతం బాధిత కుటుంబీకులు దగ్గరకు రానీయలేదు. రోడ్డుపై నిరసన తెలియజేసి జాతీయ రహదారిని దిగ్బంధనం చేశారు. దీన్నిబట్టి వారికెంత అన్యాయం జరిగిందో అర్థం చేసుకోవచ్చు. ఘటన జరిగి వారం కావస్తున్నా నిందితులను అరెస్టు చేయలేదు. 12 మందిపై లిఖిత పూర్వక ఫిర్యాదు ఇచ్చినా చర్యలు కన్పించలేదు. పోలీసుల తాత్సారంతో చివరికి హత్యకు సూత్రధారిగా ఆరోపణలు ఎదుర్కొంటున్న కొత్తకోట అమ్మినాయుడు కొన్ని రోజులు ఊరిలోనే తిరిగి, వైఎస్సార్‌సీపీ నాయకులు ఎప్పుడైతే ఘటనను సీరియస్‌గా తీసుకుని ఎస్పీకి ఫిర్యాదు చేశారో వెంటనే పరారైపోయారు.

సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం :

ఈ రెండు ఘటనలను ఒక్కసారి పోల్చిచూస్తే.. కాశీబుగ్గలో గొడవకు సంబంధం లేని వైఎస్సార్‌సీపీకి చెందిన ముగ్గురిపై టీడీపీ వారు ఫిర్యాదు చేశారని రాత్రికి రాత్రి ఇంటి నుంచి తీసుకొచ్చి పోలీసు స్టేషన్‌లో పెట్టేశారు. అదే ఫరీదుపేటలో సత్తారు గోపి హత్య చేసిన ఘటనకు సంబంధించి వారిపై లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేస్తే ఇంతవరకు అరెస్టు చేయలేదు. కాశీబుగ్గలో జరిగిన గొడవలో నిజంగా వైఎస్సార్‌సీపీ వారికి సంబంధం ఉంటే రాత్రికిరాత్రి ఇంటి నుంచి తీసుకురావాల్సిన అవసరం లేదు. ఆధారాలుంటే మరుసటి రోజైన చర్యలు తీసుకోవచ్చు. కానీ ఆ పనిచేయకుండా యుద్ధ ప్రాతిపదికన అదుపులోకి తీసుకున్నారు. ఫరీదుపేటలో పట్ట పగలు వైఎస్సార్‌సీపీకి చెందిన నాయకుడ్ని హత్య చేసి, ఆ నిందితులు ఊరిలోనే తిరుగుతుంటే చోద్యం చూశారు. యుద్ధ ప్రాతిపదికన అదుపులోకి తీసుకుని విచారణ జరిపి చర్యలు తీసుకోవచ్చు. కానీ ఆ పనిచేయలేదు. వైఎస్సార్‌సీపీ జిల్లా నాయకులంతా సీరియస్‌గా తీసుకుని ఎస్పీకి ఫిర్యాదు చేసిన తర్వాత హత్యకు సూత్రధారిగా ఆరోపణలు ఎదుర్కొంటున్న కొత్తకోట అమ్మినాయుడు అజ్ఞాతంలోకి వెళ్లిపోయారు. జరిగిన పరిణామాలన్నీ కళ్లముందే కన్పిస్తుండటంతో ఎంత ఉదాసీనంగా వ్యవహరించారో స్పష్టమవుతోంది.

ఎందుకీ వివక్ష..

ఇదంతా చూస్తుంటే ప్రజాస్వామ్యంలోనే ఉన్నామా? రౌడీ రాజ్యంలో ఉన్నామా? అనే సందేహాలు కలగకమానవు. ప్రభుత్వ పెద్దల ఒత్తిళ్లతో రెండు ఘటనలలో రెండు రకాలుగా పోలీసులు వ్యవహరించారు. ఒక దగ్గర ఒక న్యాయం,



న్యాయం చేయాలని పోలీసులకు విజ్ఞప్తి చేస్తున్న మాజీ మంత్రి సీదిరి అప్పలరాజు (ఫైల్)

> సాక్షి పత్రికా కార్యాలయంపై దాడి చేసిన వాళ్లపై కూడా అటు ఎస్పీకి, ఇటు డీఎస్పీకి, పోలీస్ స్టేషన్లలో ఫిర్యాదు చేస్తే ఇంత వరకు దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోలేదు. దాడికి పాల్పడినది టీడీపీ వారు కావడంతో వారి జోలికి పోలీసులు వెళ్లలేదు. ఆధారాలతో ఫిర్యాదు చేసినా స్పందన లేదు. కేసుల నమోదు, చర్యలు తీసుకోవడంలో ఎంత వివక్ష చూపిస్తున్నారో చెప్పడానికి ఇదొక సాక్ష్యం.

మరోచోట మరో న్యాయం చూపించారు. ప్రజలకు రక్షణ, న్యాయం విషయంలో వివక్ష కనబరిచారు. ప్రెస్‌మీట్‌లోనూ, ఇంకెక్కడైనా పోలీసు అధికారులను అడిగితే కొంతమందిని అదుపులోకి తీసుకున్నామని మాత్రం లీకులిచ్చి నాన్చుడు ధోరణి కనబరుస్తున్నారు. సరికదా హత్యకు గురైన వ్యక్తి ఏ హోదాలో వేరే భార్యభర్తల వివాదాన్ని సెటిల్ చేస్తారని కొందరు పోలీసు అధికారులు సరికొత్త వాదన తెరపైకి తెచ్చారు. హత్య కంటే భార్య భర్తల వివాదం సెటిల్ చేసే విషయాన్నే తప్పుపడుతున్నారు. ఇదేం విధానమో అర్థం కావడం లేదు.

ఎవరిదీ వైఫల్యం?

గతేడాది వైఎస్సార్‌సీపీ కార్యకర్త కూన ప్రసాద్ హత్య జరిగిన తర్వాత గ్రామంలో పోలీసు పికెట్ ఏర్పాటు చేశారు. సీసీ కెమెరాలు కూడా ఉండేవి. కానీ, హత్య కోసం సీసీ కెమెరాలను నిందితులు ధ్వంసం చేసేశారు. ఆ తర్వాత పోలీసు పికెట్ కళ్లుగప్పి సత్తారు గోపిని చంపేశారు. ఈ రెండు ఎవరి వైఫల్యమో ప్రత్యేకించి చెప్పనక్కర్లేదు. పోలీసు పికెట్ ఉన్నచోట ఎంత అప్రమత్తంగా ఉండాలో పోలీసు అధికారులకు తెలియంది కాదు. అతి సమస్యాత్మక, శాంతిభద్రతల సమస్య ఉన్న గ్రామంలో సీసీ కెమెరాలు పనిచేస్తున్నాయో లేదో ఎప్పటికప్పుడు తెలుసుకోవాల్సిన బాధ్యత గుర్తు చేయాల్సిన విషయం కాదు. ఘటనకు ముందు సరే.. ఘటన తర్వాత కూడా నిందితులపై చర్యలు తీసుకోవడంలో తాత్సారం చేశారు. ఈ లోపే కీలక సూత్రధారి పరారైపోయారు. గతంలో కూన ప్రసాద్ హత్య జరిగిన తర్వాత కూడా ఇదే రకంగా కొందరి నిందితుల విషయంలో సీరియస్‌గా వ్యవహరించలేదు. దాని పర్యవసనమే తాజా హత్య అని సాక్షాత్తు హత్యకు గురైన గోపి కుటుంబీకులే కాదు గ్రామస్తులు కూడా పోలీసు అధికారుల ఎదుటే వాపోవడమే కాకుండా నిలదీసే విధంగా మాట్లాడారంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు.

బ్లాక్‌మార్కెట్‌కు ఎరువులు



బాణాంలో ఎరువుల లారీని అడ్డుకుంటున్న రైతులు

పొందూరు రూరల్: కూటమి ప్రభుత్వం వచ్చాక ఎరువులు పక్కదారిపడుతున్నాయి. పొందూరు మండలం బాణాం రైతు సేవా కేంద్రానికి వచ్చిన సబ్సిడీ ఎరువులను గురువారం తెలుగుదేశం నాయకులు బ్లాక్‌మార్కెట్‌కు తరలిస్తుండగా మాజీ సర్పంచ్ పెద్దింటి రవిబాబు ఆధ్వర్యంలో రైతులు అడ్డుకున్నారు. లారీని అడ్డుకోవడంతో అధికార యంత్రాంగం దిగివచ్చింది. బ్లాక్ మార్కెట్‌కు వెళ్లిన ఎరువులను తిరిగి బాణాం రైతు సేవా కేంద్రానికి తరలించడంతో రైతులు నిరసన విరమించారు.

ఎరువుల దుకాణంలో విజిలెన్స్ తనిఖీలు

రణస్థలం: కోష్టా గ్రామంలో శ్రీ శ్రీనివాస ఎంటర్‌ప్రైజెస్ రిటైల్ ఎరువుల దుకాణంలో గురువారం విజిలెన్స్, వ్యవసాయ అధికారులు తనిఖీలు చేపట్టారు. రికార్డులు పరిశీలించారు. అదనపు గోదాములో సుమారు 126 మెట్రిక్ టన్నుల ఎరువులకు సంబంధించి లైసెన్స్ లేకపోవడంతో విక్రయాలు జరగకుండా నిలుపుదల చేశారు. వీటి విలువ రూ.20.46 లక్షలు ఉంటుందని అధికారులు పేర్కొన్నారు. తనిఖీల్లో సహాయ వ్యవసాయ సంచాలకులు బి.విజయప్రసాద్, విజిలెన్స్ సీఐ అదారి సంతోష్‌కుమార్, మండల వ్యవసాయాధికారి డి.విజయభాస్కర్, డీఏవో కార్యాలయ ఏఓ సురేష్, విజిలెన్స్ సిబ్బంది పాల్గొన్నారు.

ఇళ్లు ఇస్తారా? డబ్బులు చెల్లిస్తారా?



ధర్నా చేస్తున్న కుందువానిపేట గ్రామస్తులు

- టీడీపీ నేతలకు వ్యతిరేకంగా కుందువానిపేట గ్రామస్తుల నిరసన
- హుద్‌హుద్ ఇళ్లు ఇప్పిస్తానంటూ 400 మంది వద్ద డబ్బు వసూలు చేసిన మాజీ సర్పంచ్

శ్రీకాకుళం రూరల్ : అర్హులందరికీ హుద్‌హుద్ ఇళ్లు ఇవ్వాలని, లేదంటే తాము కట్టిన డబ్బులైనా తిరిగి ఇచ్చేయాలని డిమాండ్ చేస్తూ శ్రీకాకుళం రూరల్ మండల పరిధిలోని కుందువానిపేట గ్రామస్తులు గురువారం సర్పంచ్ సూరాడ సూర్యం ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. 2014–19 టీడీపీ పాలనలో తెలుగుదేశం పార్టీ చెందిన మాజీ సర్పంచ్ సూరాడ అప్పన్న ఇళ్లు ఇప్పిస్తామంటూ సుమారు 400 మంది వద్ద నుంచి రూ.12 వేలు చొప్పున వసూలు చేసి, ఇప్పుడు రోడ్డున పడేశారంటూ నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ సూర్యం మాట్లాడుతూ కుందువానిపేటలో 288 హుద్‌హుద్ ఇళ్లు మంజూరయ్యాయని తెలిపారు. వైఎస్సార్‌సీపీ హయాంలో తొలివిడతలో 145 ఇళ్లు ఇవ్వగా, రెండో విడతలో 72 ఇళ్లను అర్హులను గుర్తించి అందించారన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక టీడీపీ నాయకుడు సూరాడ అప్పన్న కేవలం తన కుటుంబ సభ్యులకు మాత్రమే 65 ఇళ్లు కేటాయించుకున్నారని, మిగిలిన వారికి అన్యాయం చేశారని చెప్పారు. దీనికితోడు కొంతమందిని హౌసింగ్ అధికారులతో ఖాళీ చేయించాలని ప్రయత్నిస్తున్నారని, ఇది ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. గ్రామస్తులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

బలవంతంగా ఖాళీ చేయిస్తున్నారు



మాది పేదకుటుంబం. వైఎస్సార్ సీపీ హయాంలో హుద్‌హుద్ ఇల్లు కేటాయించారు. ఇప్పుడు హౌసింగ్ అధికారులతో బలవంతంగా ఖాళీ చేయించారు. ఉన్నపలంగా ఎక్కడికి పోవాలి?

– బర్రి లక్ష్మి, కుందువానిపేట

న్యాయం చేయాలి..



మాది పేదకుటుంబం. ఇల్లు, స్థలం లేదు. దీంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. మాలాంటి వారికి హుద్‌హుద్ ఇల్లు కేటాయించి న్యాయం చేయాలి.

– సూరాడ రోహిణి, కుందువానిపేట

డబ్బులు తీసుకున్నాడు..



టీడీపీ నాయకుడు సూరాడ అప్పన్న ఇల్లు ఇప్పిస్తామని డబ్బులు తీసుకున్నాడు. నాలా మా గ్రామంలో చాలా మంది వద్ద డబ్బులు వసూలు చేశాడు. ఇప్పుడు ఇల్లులేదు.. డబ్బులు ఇవ్వడం లేదు.

– కరుకు రాము, కుందువానిపేట

- జిల్లాలో కుక్కల స్వైర విహారం
- రోజురోజుకూ పెరుగుతున్న కేసులు
- నిర్లక్ష్యం వద్దంటున్న వైద్యులు
- మురపాకలో రేబిస్ మరణంతో అప్రమత్తం



భౌ బౌయ్!



అరసవల్లి:

జిల్లాలో కుక్కలు స్వైర విహారం చేస్తున్నాయి. ఏ వీధి చూసినా శునకాలు మనుషులపై దాడి చేస్తున్నాయి. నడిచినా, ద్విచక్ర వాహనంపై వెళ్తున్నా ఒక్కసారిగా వెంబడిస్తూ గాయపరుస్తున్నాయి. దీంతో కుక్క కాటు బాధితుల సంఖ్యలో ఇటీవల కాలంలో ఎక్కువగా కనిపిస్తోంది. నగరమైనా, పట్టణమైనా.. గ్రామమైనా.. కుక్కల స్వైర విహారం ఎక్కువవ్వడంతో బాధితులు వేలకు చేరుకున్నారు. జిల్లాలో అన్ని ప్రాంతాల్లో అపారిశుద్ధ్య వాతావరణం అధికమవుతున్న క్రమంలో వీధి కుక్కల బెడద మరింత పెరుగుతోంది. తాజాగా కుక్క కాటుపై నిర్లక్ష్యం ఫలితంగా జిల్లాలో మురపాకకు చెందిన ఓ యువకుడు ప్రాణాలు కోల్పోవడం సంచలనంగా మారింది. దీంతో ఎక్కడైనా కుక్క కాటుకు గురైన వారు కచ్చితంగా నిర్లక్ష్యం వీడి వ్యాక్సిన్‌ను వేయించుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు. ఏ మాత్రం అశ్రద్ధ చేసినా ప్రాణాంతకమవుతుందని హెచ్చరిస్తున్నారు. జిల్లాలో కుక్కకాటు (రేబిస్)తో డెత్ కేసు నమోదు కావడంతో జిల్లాలో వైద్య శాఖ అప్రమత్తమయ్యింది.

నాలుగు నెలలు.. 2413 కుక్క కాటు కేసులు..

జిల్లాలో 2024–25 వార్షిక సంవత్సరంలో 8963 కుక్క కాటు కేసులు నమోదయ్యాయి. 2025–26 అంటే ఈ నాలుగు నెలల్లోనే ఏకంగా 2413 కేసులు నమోదవ్వడం గమనార్హం. గత ప్రభుత్వంలో అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లోనూ ఏఆర్‌వీ (యాంటీ రేబిస్ వ్యాక్సిన్) అందుబాటులో ఉండేవి. ఇప్పుడు కూటమి ప్రభుత్వంలో మందుల సరఫరా వ్యాక్సిన్ సరఫరాలు అంతా సగం సగం గానే పంపిణీ అవుతున్నాయి. దీంతో చాలా చోట్ల కుక్క కాటుకు గురైన వారు ప్రైవేటు ఆసుపత్రులను ఆశ్రయిస్తున్నారు. ముఖ్యంగా క్షేత్ర స్థాయిలో ప్రభుత్వ వైద్య సదుపాయాలు దారుణంగా ఉండడంతో సాధారణ జబ్బులతో అవస్థలు పడుతున్న వారి సంఖ్య అధికమవుతున్నారు. దీంతో పాటు కుక్క కాటు బాధితులకు కూడా అవస్థలు తప్పడం లేదు.



ఈ చిత్రంలో ఉన్న చిన్నారి పేరు షేక్ ఉస్మాన్. ఇచ్ఛాపురం మండలం ఎం.తోటూరుకు చెందిన ఈ చిన్నారి తోటి స్నేహితులతో కలిసి ఈ నెల 15న ఆడుకుంటుండగా ఓ కుక్క దాడి చేసింది. ఈ ఘటనలో బాలుడి కన్ను, తలపై తీవ్ర గాయాలయ్యాయి. కుటుంబ సభ్యులు హుటాహుటిన ఇచ్ఛాపురం సామాజిక ఆసుపత్రికి తరలించారు. అదే రోజు, ఇచ్ఛాపురం పట్టణంలోనే ఎ.ప్రణతీ అనే బాలికపైనా వీధి కుక్క దాడి చేసి గాయపరచడంతో ఆసుపత్రిలో చికిత్స అందజేశారు.

• లావేరు మండలం మురపాక గ్రామంలోనూ ఓ యువకుడు కుక్కకాటుతో మృత్యువాతపడ్డాడు. కుక్క కాటు వేసినా వ్యాక్సిన్ వేసుకోకుండా నిర్లక్ష్యం వహించడంతో రేబిస్ సోకి మృతి చెందాడు.

• వ్యాప్తి ఇలా...



కుక్క కరిచినప్పుడు దాని లాలాజలంలో ఉండే వైరస్ మనిషి కండరాల్లోకి చేరుతుంది. కండరాల్లో వైరస్ అభివృద్ధి చెంది సున్నితమైన ఫైబర్ ద్వారా వెన్నెముకలోకి ప్రవేశిస్తుంది. అక్కడ్నుంచి మెదడుకు, ఆ తరువాత చిన్న మెదడుకు, అనంతరం అన్ని భాగాల్లోకి చేరుతుంది. ఆ తరువాత నాడీ వ్యవస్థనుంచి తిరోగమన ప్రక్రియ ద్వారా లాలాజల గ్రంథుల్లోను, కళ్లు, చర్మంలోకి చేరుకుని అక్కడ్నుంచి వైరస్ ఇతరులకు వ్యాపిస్తుంది.

• ఏడాదిలో ఎప్పుడైనా...

కుక్క కరిచిన నాటి నుంచి వ్యాధి లక్షణాలు ఏడాదిలోపు ఎప్పుడైనా బయటపడొచ్చని చెబుతున్నారు వైద్యులు.

- 30 రోజుల్లో 25 శాతం మందిలో కనిపిస్తాయి.
- 30 నుంచి 90 రోజుల్లో 50 శాతం మందిలో బయటపడతాయి.
- 90 నుంచి ఏడాది లోపు 20 శాతం, ఒక సంవత్సరం తరువాత 5 శాతం కనిపిస్తాయి.

• నీటిని చూసినా.. గాలి పీల్చినా..

- **మొదటి దశ:** జ్వరం, తలనొప్పి, నీరసం, నిరాశ, ఆందోళన, న్యూరోపతిక్ నొప్పి, నిద్రలేమి
- **రెండో దశ:** హైపరేక్టివిటీ, ఆందోళన, మూర్ఛ, హైడ్రో ఫోబియా (నీటిని చూస్తే భయం), ఏరో ఫోబియా (గాలి అంటే భయం)
- **మూడో దశ:** రెండు వారాల్లో కోమాలోకి వెళ్లే అవకాశం
- **నాలుగో దశ:** ఒకటి నుంచి ఆరు రోజుల్లో శ్వాస తీసుకోవడంలో తీవ్రమైన ఇబ్బంది
- ఈ వ్యాధి సోకిన వారికి చివరి దశలో నీటిని చూసినా, గాలిని పీల్చినా మెడలోని గాలిని నియంత్రించే వ్యవస్థలు, నీటిని గుటక వేయడాన్ని నియంత్రించే వ్యవస్థలు, శ్వాస పీల్చే వ్యవస్థలు దెబ్బ తినడంవల్ల మరణం సంభవిస్తుంది.

శుభ్రంగా కడగాలి



కుక్క కాటుకు గురికాగానే ప్రాథమికంగా వూండ్ వాష్ చేయాలి. ఇదే అత్యంత ముఖ్యమైన ప్రక్రియ. గాయమైన ప్రదేశాన్ని సబ్బు నీళ్లతో శుభ్రంగా కడిగి యాంటీ సెప్టిక్ లోషన్ రాయాలి. వైరస్ శరీరంలోకి ఎక్కకుండా వెంటనే వైద్యులను సంప్రదించాలి. లేదంటే నాడీ వ్యవస్థపై ప్రభావం చూపే అవకాశం ఉంది.

– డాక్టర్ కె.అనిత, డీఎంహెచ్‌వో

క్లుప్తంగా

మార్కెట్ కమిటీ చైర్మన్ల నియామకం

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్లను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. జిల్లాలో నాలుగు మార్కెట్ కమిటీల చైర్మన్ల నియమించినట్లు తెలిపారు. పాతపట్నం నియోజకవర్గంలో హిరమండలం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా మామిడి రామకృష్ణ (జనసేన), పాతపట్నం చైర్‌పర్సన్‌గా గొరమ్మ చిన్నింటి, ఇచ్ఛాపురం నియోజకవర్గంలోని కంచిలి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్‌గా మద్దిలి విజయలక్ష్మి (టీడీపీ), శ్రీకాకుళం నియోజకవర్గంలోని శ్రీకాకుళం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్‌గా దారపు జ్యోత్స్న(జనసేన) ను నియమించినట్లు తెలిపారు.

అప్పల బాధతో వ్యక్తి ఆత్మహత్య

పొందూరు: స్థానిక కచేరీ వీధికి చెందిన చిరు వ్యాపారి ఎరబోతు దుర్గారావు(28) బుధవారం రాత్రి తన ఇంట్లో ఫ్యానుకు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఇంట్లో ఎవరూ లేని సమయంలో తలుపులు వేసుకుని ఫ్యానుకు ఉరివేసుకున్నాడు. రాత్రి కుటుంబ సభ్యులకు అనుమానం వచ్చి తెరిచిచూడగా ఉరికి వేలాడుతూ కనిపించాడు. వెంటనే స్థానిక సామాజిక ఆస్పత్రికి తరలించారు. అయితే అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. పోస్టుమార్టం నిమిత్తం శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు. గురువారం పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు మృతదేహాన్ని పోలీసులు అప్పగించారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ సత్యనారాయణ తెలిపారు.

గంజాయితో ఇద్దరు అరెస్టు



స్వాధీనం చేసుకున్న గంజాయి

ఇచ్ఛాపురం టౌన్: ఒడిశా నుంచి ముంబాయికి 22.566 కిలోల గంజాయి తరలిస్తున్న ఒడిశా రాష్ట్రం మోహన బ్లాక్‌కు చెందిన తులుషా నాయిక్, సామ్సన్ బీరోలను అరెస్టు చేసినట్లు సోంపేట ఎక్సైజ్ మొబైల్ సీఐ జీవీ రమణ తెలిపారు. జిల్లా ఎక్సైజ్ శాఖ సూపరింటెండెంట్ ఆదేశాల మేరకు అసిస్టెంట్ సూపరింటెండెంట్ మురళీధర్ ఆధ్వర్యంలో సోంపేట మొబైల్ ఎక్సైజ్ బృందం ఇచ్ఛాపురం రైల్వేస్టేషన్ చుట్టుపక్కల గురువారం తనిఖీలు చేపట్టింది. ఆ సమయంలో అనుమానాస్పదంగా తులుషా నాయిక్, సామ్సన్ బీరోలు తిరుగుతుండగా గమనించి వారి లగేజీ తనిఖీ చేశారు. దీంతో వారి వద్ద 22.566 కిలోల గంజాయి పట్టుబడడంతో అదుపులోకి తీసుకున్నారు. ఒడిశాలోని జితున్ అనే వ్యక్తి వీరి ద్వారా ట్రైన్‌లో ముంబాయికి గంజాయి తరలించేందుకు ఒప్పందం కుదుర్చుకున్నట్లు విచారణలో తేలింది. స్వాధీనం చేసుకున్న గంజాయి విలువ రూ.లక్ష వరకు ఉంటుందన్నారు. తనిఖీల్లో ఎక్సైజ్ ఎస్‌ఐ ఐ.సుజాత, సిబ్బంది శ్రీనివాస్, విజయ్, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

రేషన్ తూకంలో తేడా వస్తే చర్యలు



మెట్టవలసలో స్థలాన్ని పరిశీలిస్తున్న అధికారులు

జి.సిగడాం: ప్రభుత్వం ప్రజలకు అందిస్తున్న రేషన్ బియ్యం తూకంలో తేడా వస్తే ఉపేక్షించేది లేదని శ్రీకాకుళం రెవెన్యూ డివిజనల్ అధికారి కె.సాయి ప్రత్యూష హెచ్చరించారు. మండల కేంద్రంలోని పౌర సరఫరాల గిడ్డంగిని గురువారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రేషన్ డిపో డీలర్లకు బియ్యం తరుగుదల లేకుండా పంపిణీ చేయాలని, ఎక్కడైనా బియ్యం తరుగుదల వస్తే వెంటనే సంబంధిత గోదాం అధికారులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. రేషన్ సరుకులు లబ్ధిదారులకు సకాలంలో అందేవిధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎఫ్‌సీ గోదాం నుంచి వస్తున్న బియ్యాన్ని తూకం వేసి తీసుకోవాలన్నారు. అనంతరం మెట్టవలస గ్రామంలో మందుగుండు సామాగ్రి విక్రయించేందుకు షాపు నిర్మాణం కోసం దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారుడి స్థలాన్ని పరిశీలించారు. ప్రభుత్వ నిబంధనల మేరకే అనుమతులు ఇస్తామన్నారు. ఆమెతో పాటు తహసీల్దార్ మహాదేవు సరిత, ఆర్‌ఐ అబోతుల రాధ, వీఆర్వో లక్ష్మణరావు తదితరులు ఉన్నారు.

పక్కాగా ప్రీస్కూల్ నిర్వహణ

సారవకోట: అంగన్‌వాడీ కేంద్రాలలో ప్రీ స్కూల్ నిర్వాహణ పక్కాగా జరగాలని సారవకోట ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారి ఎస్.అనూరాధ సిబ్బందికి సూచించారు. గురువారం సారవకోట మండల పరిషత్ సమావేశ మందిరంలో సారవకోట, జలుమూరు మండలాల అంగన్‌వాడీ కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. పీపీ-1, పీపీ-2 పాఠ్య పుస్తకాలలో ఉన్న సబ్జెక్టు మేరకు ప్రతిరోజు అంగన్‌వాడీ కేంద్రాలలో ప్రీ స్కూల్ నిర్వహణ చేపట్టాలన్నారు. కేంద్రాల నిర్వహణ, లబ్ధిదారులకు అందాల్సిన పౌష్టికాహారం తదితర వివరాలను యాప్‌లలో నమోదు చేయాలన్నారు. సమావేశంలో సూపర్‌వైజర్లు సుజాత, సీతారత్నం, పద్మావతి, మనోహరి పాల్గొన్నారు.

పరీక్ష పాట్లు..?



శ్రీకాకుళంలోని ఒక ప్రభుత్వ కళాశాలలో యూనిట్ పరీక్షలు రాస్తున్న విద్యార్థులు

- ప్రారంభమైన ఇంటర్మీడియట్ యూనిట్ పరీక్షలు
- చాలాచోట్ల ప్రశ్నపత్రాలు అందక అవస్థలు
- కొన్నిచోట్ల డిక్టేట్ చేస్తుంటే రాస్తున్న వైనం
- ఆందోళన చెందుతున్న విద్యార్థులు

శ్రీకాకుళం న్యూకాలనీ:

ఇంటర్మీడియట్ విద్యార్థులకు మొదటి యూనిట్ పరీక్షలు గురువారం నుంచి ప్రారంభమయ్యాయి. జిల్లావ్యాప్తంగా అన్ని ప్రభుత్వ, సాంఘిక, గిరిజన, గురుకులం, మోడల్ కాలేజీలు, కేజీబీవీలు, హైస్కూల్ ప్లస్‌లలో చదువుతున్న ఇంటర్మీడియట్ విద్యార్థులు ఈ పరీక్షలను రాస్తున్నారు. రోజుకు రెండు పరీక్షలు చొప్పున పరీక్షలు జరుగుతున్నాయి. మొదటి సెషన్ ఉదయం 11.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు, రెండో సెషన్ మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు జరుగుతోంది.

జిల్లాలో ఇదీ పరిస్థితి...

పునర్విభజన శ్రీకాకుళం జిల్లాలో అన్ని ప్రభుత్వ యాజమాన్య జూనియర్ కాలేజీలు 94 ఉన్నాయి. వీటిల్లో 19 వేల మంది వరకు విద్యార్థులు వివిధ ఇంటర్ కోర్సుల్లో చదువుతున్నారు. ఈ యూనిట్ పరీక్షల కోసం గత పది రోజులుగా ఇంటర్ బోర్డు నానా హడావుడి చేసినప్పటికీ.. ప్రశ్నాపత్రాలను విద్యార్థులకు చేర్చడంలో సఫలీకృతం కాలేదని తెలుస్తోంది. ప్రశ్నాపత్రాలను విద్యార్థులకు అందజేసేందుకు కాలేజీల్లో నానా అగచాట్లు పడుతున్నారు. పరీక్షకు స్వల్ప వ్యవధి ముందు క్వశ్చన్ పేపర్‌ను వెబ్‌సైట్‌లో పెడుతుండడంతో ప్రిన్సిపాల్స్ కష్టాలు అన్నీఇన్నీ కావు.

డౌన్‌లోడ్ చేసి.. డిక్టేట్ చేస్తున్నారు

ఇదిలా ఉంటే రాష్ట్రవ్యాప్తంగా అన్ని యాజమాన్యాల విద్యార్థులు యూనిట్ టెస్ట్‌లు, త్రైమాసిక, అర్థ సంవత్సర పరీక్షలను ఒకే ప్రశ్నాపత్రంతో రాసే విధానాన్ని 2023లో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో తీసుకొచ్చారు. నాటి ప్రభుత్వ ఆదేశాలతో ఇంటర్ బోర్డు ఉన్నతాధికారులు చేసిన ప్రయత్నం మంచి ఫలితాలను ఇచ్చింది. అంతవరకు బాగానే ఉన్నప్పటికీ తాజాగా జరుగుతున్న యూనిట్ టెస్ట్ ప్రశ్నాపత్రాలను విద్యార్థులకు మెజారిటీ కాలేజీల్లో అందజేయలేదని తెలుస్తోంది. ప్రశ్నాపత్రాలను విద్యార్థులకు అందజేయాల్సిందేనని జిల్లా అధికారులు ఆదేశించినప్పటికీ.. వివిధ కాలేజీల్లో ప్రశ్నాపత్రాలను ఇంటర్ బోర్డు వెబ్‌పోర్టల్ నుంచి డౌన్‌లోడ్ చేసి విద్యార్థులకు డిక్టేట్ చేసినట్లు సమాచారం. ఐఎఫ్‌పీ ప్యానెల్స్‌పై లేదా బ్లాక్ బోర్డులపై క్వశ్చన్ పేపర్లలోని ప్రశ్నలను లెక్చరర్లు రాసి, తమను రాసుకోమంటున్నారని విద్యార్థులు చెబుతున్నారు. దీంతో ఇంగ్లిష్, మ్యాథ్స్, కామర్స్ ఇతర ఒకేషనల్ పేపర్ల సందర్భంలో చాంతడంత ప్రశ్నలు రాయాల్సిన దుస్థితి తల్చుకుని ఆందోళన చెందుతున్నారు.

ప్రిన్సిపాల్స్‌కు అష్టకష్టాలు

ఆ మధ్య యోగా డే, ఇటీవల మెగా పేరెంట్స్ మీటింగ్, తాజాగా యూనిట్ టెస్ట్ పరీక్షలు, మరోవైపు ఆన్‌లైన్ అడ్మిషన్లు ఇలా ప్రిన్సిపాల్స్‌కు ఊపిరి తీసుకునే సమయం ఉండడం లేదు. ప్రశ్నాపత్రాలను జిరాక్స్ తీసేందుకు తగినంత సమయం లేకపోవడం, నిధులు కేటాయించకపోవడం, గ్రామీణ ప్రాంతాల్లో జిరాక్స్ సెంటర్లు లేకపోవడం, కాలేజీల్లో వందలాది ప్రింట్లు తీసే ప్రింటర్లు అందుబాటులో లేకపోవడం వంటి కారణాలతో అష్టకష్టాలు పడుతున్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఒకే ప్రశ్నాపత్రంతో విద్యార్థులు పరీక్షలు రాస్తున్నారన్న సంగతి అటుంచితే.. మెజారిటీ కాలేజీల్లో నిర్దేశించిన సిలబస్ పూర్తి కాలేదని తెలుస్తోంది. చాలాచోట్ల ఇప్పటికీ వివిధ సబ్జెక్టుల లెక్చరర్లు లేరు. ఈ మధ్యనే రేషనలైజేషన్ ప్రక్రియ, లెక్చరర్ల బదిలీలు, ప్రిన్సిపాల్స్ పదోన్నతలతో ఏర్పడిన ఖాళీల భర్తీ ఇంకా పూర్తి కాలేదు. లెక్చరర్ల లేనిచోట దుస్థితి ఒకలా ఉంటే.. లెక్చరర్లు ఉన్నచోట్ల పరిస్థితి మరోలా ఉంది. విద్యార్థులకు చెప్పిన పాఠాలొకటి.. ఇచ్చిన ప్రశ్నలొకటని గుసగుసలు వినిపిస్తున్నాయి.

సూచనలు చేశాం



యూనిట్ టెస్ట్ పరీక్షలపై ప్రిన్సిపాల్స్‌కు అనేక సూచనలు చేయడం జరిగింది. పరీక్షల ప్రశ్నాపత్రాలను ప్రింటౌట్ తీసి విద్యార్థులకు అందజేయాలని ఆదేశించడమైంది. కచ్చితంగా ఇంటర్ బోర్డు ఉన్నతాధికారుల ఆదేశాలను కాలేజీల్లో అమలు చేయాల్సిందే. అమలు కాకుంటే చర్యలు తప్పవు. దీనిపై ఉన్నతాధికారులకు నివేదిస్తాం.

– పి.దుర్గారావు, జిల్లా ఆర్‌ఐవో, ఇన్‌చార్జి డీవీఈవో, శ్రీకాకుళం

వైఎస్సార్‌సీపీ అనుబంధ విభాగాల నియామకం

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అనుబంధ విభాగాల్లో జిల్లాకు చెందిన నాయకులను నియమిస్తూ పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ఈ నియామకాలు చేపట్టినట్లు పేర్కొన్నారు.

హోదా	పేరు	నియోజకవర్గం
రాష్ట్ర మహిళా విభాగం కార్యదర్శి	కొర్ల శిరీష	పలాస
రాష్ట్ర మహిళా విభాగం కార్యదర్శి	టి.కామేశ్వరి	శ్రీకాకుళం
రాష్ట్ర మహిళా విభాగం సంయుక్త కార్యదర్శి	అల్లు లక్ష్మీప్రసన్న	శ్రీకాకుళం
రాష్ట్ర బీసీసెల్ ప్రధాన కార్యదర్శి	సురవరపు నాగేశ్వరరావు	ఆమదాలవలస
రాష్ట్ర బీసీసెల్ కార్యదర్శి	నర్తు నరేంద్రయాదవ్	ఇచ్ఛాపురం
రాష్ట్ర బీసీసెల్ కార్యదర్శి	బాన్న నర్సింగరావు	శ్రీకాకుళం
క్రిస్టియన్ మైనార్టీ సెల్ ప్రధాన కార్యదర్శి	ప్రతి అన్వేష్	ఇచ్ఛాపురం

భూసేకరణకు వ్యతిరేకంగా పోరాడాలి



మాట్లాడుతున్న రైతు సంఘం కార్యదర్శి మోహనరావు

కాశీబుగ్గ: కార్గో ఎయిర్‌పోర్టుకు సంబంధించి బలవంతపు భూసేకరణకు వ్యతిరేకంగా పోరాడాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.మోహనరావు, జీడి రైతు సంఘం జిల్లా కన్వీనర్ తెప్పల అజయ్‌కుమార్, రైతు సంఘం మండల అధ్యక్ష, కార్యదర్శులు కె.బాలాజీరావు, తమ్మినాన భాస్కరరావు, సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎం.గణపతి పిలుపునిచ్చారు. గురువారం పలాస సీఐటీయూ కార్యాలయంలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. ఉద్దానం తీర ప్రాంతంలో గ్రీన్‌ఫీల్డ్ కార్గో ఎయిర్‌పోర్టు కోసం రైతుల అభిప్రాయం తెలుసుకోకుండా భూముల సర్వే చేయడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామన్నారు. పచ్చని ఉద్దానం విధ్వంసానికి రాష్ట్ర ప్రభుత్వం పూనుకుంటోందని, ప్రజల ప్రయోజనాలకు భిన్నంగా ప్రభుత్వం ఏకపక్ష నిర్ణయాలు విచారకరమన్నారు. ఎవరు ఎన్ని ఆందోళనలు, ధర్నాలు చేసినా ఎయిర్‌పోర్టు నిర్మాణం ఆగదని స్థానిక ఎమ్మెల్యే గౌతు శిరీష ప్రకటన రైతులను రెచ్చగొట్టే విధంగా ఉందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి రైతుల అభిప్రాయాలను పరిగణలోకి తీసుకోవాలని కోరారు.

పాతపట్నంలో ట్రాఫిక్ సమస్య



నిలిచిపోయిన ట్రాఫిక్

పాతపట్నం: మండల కేంద్రంలో ట్రాఫిక్ సమస్యలు రోజురోజుకూ పెరుగుతున్నాయి. పాతపట్నం సెయింట్‌ఆన్స్ పాఠశాల వద్ద గురువారం ఉదయం ట్రాఫిక్ నిలిచిపోవడంతో వాహనదారులు, ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. మండల కేంద్రంలో 13 ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు ఉన్నాయి. ఉదయం పాఠశాలలు తెరిచేటప్పుడు, సాయంత్రం విడిచిపెట్టే సమయంలో విపరీతంగా ట్రాఫిక్ ఉంటోంది. ఇటీవల ట్రావెల్స్ బస్సులు కూడా ప్రధాన రహదారిలో ప్రయాణికులను దించేటప్పుడు ట్రాఫిక్ ఉన్నచోట నిలిపివేస్తుండడంతో ఇబ్బందులు మరింత పెరుగుతున్నాయి. అందువలన ఇప్పటికైనా పోలీసులు స్పందించి ట్రాఫిక్ లేకుండా చూడాలని ప్రజలు, వాహనదారులు వాపోతున్నారు.

స్మార్ట్ మీటర్లు వద్దు



ప్రభుత్వ విధానాలపై నినదిస్తున్న వామపక్ష నేతలు

- ట్రూ అప్ చార్జీలు రద్దు చేయాలి
- వామపక్ష నాయకుల డిమాండ్

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ):

విద్యుత్ స్మార్ట్ మీటర్లు వద్దని, ట్రూ అప్ చార్జీలు రద్దు చేయాలని కోరుతూ వామపక్ష నాయకులు సీపీఎం పార్టీ జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు, సీపీఐ జిల్లా కార్యదర్శి చాపర వెంకటరమణ, సీపీఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ జిల్లా కార్యదర్శి తాండ్ర ప్రకాష్ డిమాండ్ చేశారు. స్థానిక సుందరయ్య భవన్ సీపీఎం కార్యాలయంలో విద్యు త్ భారాలకు వ్యతిరేకంగా స్మార్ట్ మీటర్లు రద్దు చేయాలని కోరుతూ రౌండ్ టేబుల్ సమావేశం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా వక్త లు మాట్లాడుతూ.. విద్యుత్ చార్జీలపై ఆగస్టు 5వ తేదీన విద్యుత్ సబ్‌స్టేషన్ కార్యాలయాల వద్ద చేప ట్టనున్న ధర్నాలను జయప్రదం చేయాలని కోరా రు. ఎన్నికలకు ముందు స్మార్ట్ మీటర్లు బద్దలుగొ ట్టండి అని యువగళం పాదయాత్రలో లోకేష్ పిలు పునిచ్చారని, అధికారంలోకి వచ్చిన తర్వాత అదానీ స్మార్ట్ మీటర్లు బిగించడం మోసం కాదా అని ప్రశ్నించారు. స్మార్ట్ మీటర్లు ద్వారా ప్రజలను తీవ్రంగా దోపిడీ చేయడానికి పూనుకుంటున్నారని మండిపడ్డారు.

అధికారంలోకి వచ్చాక మోసం

ఇప్పటికే పెరిగిన విద్యుత్ బిల్లులతో సామాన్య ప్రజలు గగ్గోలు పెడుతున్నారని, ఎన్నికలకు ముందు కూటమి నాయకులు కరెంటు చార్జీలు పెంచబోమని చెప్పారని గుర్తు చేశారు. ఇప్పుడు అత్యధికంగా విద్యుత్ చార్జీలు వసూలు చేస్తూ కూటమి ప్రభుత్వం ప్రజలను మోసం చేస్తోందని దుయ్యబట్టారు. అదానీ స్మార్ట్ మీటర్ల ఖర్చులు నిమిత్తం 93 నెలల్లో అదనపు చార్జీలు వసూలు చేస్తారన్నారు. వాటిని ఇళ్లకు బిగించకుండా ప్రజలు వ్యతిరేకించాలని కోరారు. దక్షిణాదిలో కేరళ, బెంగాల్, తమిళనాడు, కర్ణాటక ప్రభుత్వాలు స్మార్ట్ మీటర్లను వ్యతిరేకించాయని తెలియజేశారు. రాష్ట్రంలో రెండు కోట్ల మీటర్లు పెట్టి రూ.25 వేల కోట్ల భారం ప్రజల మీద వేసేందుకు పూనుకున్నారని విమర్శించారు. స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా ఉద్యమం ఉధృతం చేయాలని పిలుపునిచ్చారు. జూలై 18 నుంచి 22 వరకు పట్టణ, మండల కేంద్రాల్లో సదస్సులు నిర్వహించాలని నిర్ణయించారు. కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు, ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గంగరావు సింహాచలం, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సీహెచ్ అమ్మన్నాయుడు, ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు పి.చంద్రరావు, పట్టణ పౌర సంక్షేమ సంఘం కన్వీనర్ ఎం.గోవర్ధనరావు తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



నిరసన తెలుపుతున్న మున్సిపల్ కార్మికులు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): మున్సిపల్ కార్మికుల సమస్యలు వెంటనే పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సీహెచ్ అమ్మన్నాయుడు, నగర కన్వీనర్ ఆర్.ప్రకాష్, ఏపీ మున్సిపల్ వర్కర్స్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ నగర అధ్యక్షుడు అరుగుల గణేష్‌లు డిమాండ్ చేశారు. మున్సిపల్ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్న సమ్మెలో భాగంగా మున్సిపల్ వర్కర్స్ - ఎంప్లాయిస్ ఫెడరేషన్, సీఐటీయూ ఆధ్వర్యంలో శ్రీకాకుళం నగరపాలక కార్యాలయం వద్ద గురువారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మున్సిపల్ కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి ఏడాది పూర్తయినప్పటికీ మున్సిపల్ కార్మికులకు ఇచ్చిన హామీలు అమలు చేయలేదని దుయ్యబట్టారు. గత రాష్ట్రవ్యాప్త సమ్మె సమయంలో ప్రభుత్వం అంగీకరించిన ఒప్పందాలకు జీవోలు జారీ చేయకపోవడం, ఆప్కాస్ సంస్థను సైతం రద్దు చేసి ప్రైవేట్ ఏజెన్సీలకు అప్పగించాలనుకోవడం సరికాదని మండిపడ్డారు.

ప్రభుత్వ పథకాలు అందజేయాలి

తల్లికి వందనం వంటి ప్రభుత్వ సంక్షేమ పథకాలు మున్సిపల్ కాంట్రాక్టు కార్మికులకు కూడా అందజేయాలని కోరారు. గత 17 రోజుల సమ్మె కాలపు ఒప్పందాలైన రిటైర్మెంట్ బెనిఫిట్స్, హామీలకు జీవో జారీ చేయ్యాలని డిమాండ్ చేశారు. ఉద్యోగ విరమణ వయస్సు 62 ఏళ్లకు పెంచాలని, గ్రాట్యూటీ చెల్లించాలని విన్నవించారు. ఇప్పటికైనా అట్టడుగు వర్గాలుగా ఉన్న మున్సిపల్ కార్మికుల సమస్యలను ప్రభుత్వం, మున్సిపల్ అధికారులు పరిష్కరించాలన్నారు. లేకుంటే రానున్న రోజుల్లో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. వీరికి ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గంగరావు సింహాచలం, పట్టణ పౌర సంక్షేమ సంఘం కన్వీనర్ ఎం.గోవర్ధనరావు, ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు పి.చంద్రరావులు మద్దతు తెలిపారు.

కార్యక్రమంలో ఎ.శంకర్, ఎ.మోహన్, డి.చిట్టిబాబు, ఆర్.యుగంధర్, ఎస్.పార్వతి, ఎ.లక్ష్మి, ఆర్.ఈశ్వరమ్మ, పి.మల్లమ్మ, కె.బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

సచివాలయ ఉద్యోగిని అదృశ్యంపై కేసు నమోదు

ఆమదాలవలస: మండలంలోని రామచంద్రాపురం గ్రామ సచివాలయంలో వైద్య విభాగ విధులు నిర్వహిస్తున్న సచివాలయ ఉద్యోగిని కనిపించకపోవడంపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు గురువారం తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. పట్టణంలోని వరదా వారి క్వార్టర్స్‌లో నివాసముంటున్న ఉద్యోగిని బుధవారం విధులకు వెళ్లినట్లు తల్లి తెలిపింది. అయితే విధులకు వెళ్లిన తన కుమార్తె గురువారం ఉదయం వరకు ఇంటికి తిరిగి రాకపోవడంతో పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

వేధింపుల నుంచి రక్షణ కల్పించండి

టెక్కలి: టెక్కలి ఆర్డీవోతో పాటు కొంతమంది వ్యక్తులు తనకు చెందిన స్థలం విషయమై చేస్తున్న వేధింపుల నుంచి రక్షణ కల్పించాలని నందిగాం మండలంలోని బడగాం గ్రామానికి చెందిన బలగ ప్రకాశ్ కోరారు. ఈ మేరకు గురువారం విశాఖపట్నం పర్యటనకు విచ్చేసిన జాతీయ ఎస్సీ కమిషన్ సభ్యుడు వడ్డేపల్లి రామచందర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. టెక్కలి ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు ఆనుకుని సర్వే నంబర్లు 520/1, 520/3 లో అన్ని రకాల అనుమతులతో ఉన్నటువంటి తనకు చెందిన స్థలంపై లేనిపోని వివాదాలు సృష్టించి, మానసికంగా వేధింపులకు పాల్పడుతున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. టెక్కలి ఆర్డీవోతో పాటు మరో ముగ్గురు వ్యక్తులు తనను మానసికంగా వేధింపులకు గురి చేస్తున్నారన్నారు. దళితుడైన తనకు రక్షణ కల్పించాలని విన్నవించాడు.

ఇదేం పద్ధతి..?



టెక్కలి పాత జాతీయ రహదారిలో సెంట్రల్ లైటింగ్

- టెక్కలిలో పనుల అంచనాలు పెంచేసిన అధికారులు
- వ్యతిరేకిస్తున్న వార్డు సభ్యులు
- నిధులు దోచుకోవడానికేనని ఆరోపణ

టెక్కలి: టెక్కలి మేజర్ పంచాయతీలో వివిధ రకాల పనుల కోసం అధికారులు తయారు చేసిన నిధుల అంచనాలను వార్డు సభ్యులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. పంచాయతీ నిధులను దోచుకోవడానికే అధికార పార్టీకి చెందిన కార్యకర్తలు చెప్పినట్లుగా అధికారులు అమాంతంగా నిధుల అంచనాలను పెంచేశారంటూ మండిపడుతున్నారు. దీనిలో భాగంగా ఇటీవల పంచాయతీ కార్యాలయంలో నిర్వహించిన సాధారణ సమావేశంలో పంచాయతీ అధికారులు వార్డు సభ్యులకు అందజేసిన అజెండాలో పొందుపరచిన అంశాలను చూసి ఒక్కసారిగా ఆశ్చర్యపోయారు. అంతేకాకుండా తమ పరిధిలో తమకు తెలియకుండా అధికారులు ఒంటెద్దు పోకడతో ఇష్టానుసారంగా తయారు చేసిన అంచనాలను వ్యతిరేకిస్తూ సమావేశాన్ని బహిష్కరించారు. ప్రధానంగా టెక్కలి జగతిమెట్ట నుంచి జాతీయ రహదారి బైపాస్ వరకు ఉన్నటువంటి సెంట్రల్ లైటింగ్ మరమ్మతుల కోసం ఏకంగా రూ.35 లక్షలతో ప్రతిపాదనలు చేయడంపై కంగుతిన్నారు. వీటితో పాటు మరికొన్ని పనుల అంచనాలను తప్పుబడుతున్నారు.

దోచుకోవడానికే...



టెక్కలి మేజర్ పంచాయతీలో అభివృద్ధి పనుల పేరుతో అధికార పార్టీ కార్యకర్తలు చెప్పినట్లుగా అధికారులు అంచనాలు రూపొందించారు. భారీగా అంచనాలు పెంచేసి నిధులను దోచుకోవడానికి ప్లాన్ వేశారు. ముఖ్యంగా సెంట్రల్ లైటింగ్ విషయంలో రూ.35 లక్షల మేరకు అంచనాలు చూస్తుంటే, పంచాయతీలో నిధులు గోల్‌మాల్ చేయడానికి కుట్ర జరుగుతోందని తెలుస్తోంది. అధికారులు తయారు చేసిన అంచనాలతో పాటు గతంలో వార్డు సభ్యులకు తెలియకుండా చేసిన పనులపై విచారణ చేపట్టాలి.

– దాడి ధర్మారావు, వార్డు సభ్యుడు, టెక్కలి మేజర్ పంచాయతీ

దోపిడీని అడ్డుకుంటాం



టెక్కలి మేజర్ పంచాయతీలో అభివృద్ధి పనుల పేరుతో చేస్తున్న నిధుల దోపిడీని అడ్డుకుంటాం. ఇప్పటికే పలు సమావేశాల్లో వార్డు సభ్యులంతా వ్యతిరేకిస్తున్నాం. వార్డు సభ్యుల పరిధిలో కనీసం సంప్రదించకుండా అడ్డగోలుగా చేసిన పనులకు మేమెందుకు ఆమోదం ఇవ్వాలి. కొత్తగా తయారు చేసిన అంచనాలు చూస్తుంటే ఆశ్చర్యం కలుగుతోంది. ప్రజల అవసరాలకు ఖర్చు చేయాల్సిన నిధులను దోపిడీ చేస్తామంటే ఊరుకునేది లేదు. దీనికి అధికారులు బాధ్యత వహించాల్సి ఉంటుంది.

– పీత రమణబాబు, వార్డు సభ్యుడు, టెక్కలి మేజర్ పంచాయతీ

రోడ్డు ప్రమాదంలో దంపతులకు గాయాలు

టెక్కలి రూరల్:



గాయపడిన సరస్వతి



తీవ్రగాయాలకు గురైన సంజీవ్

సంతబొమ్మాళి మండలంలోని పాలేశ్వరమ్మ ఆలయం సమీపంలో గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో దంపతులకు తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాలు మేరకు.. బోరుభద్ర పంచాయతీ పరిధి ఉదయ్‌పురం గ్రామానికి చెందిన భార్యాభర్తలు వంకల సంజీవ్, వంకల సరస్వతిలు తమ గ్రామం నుంచి ద్విచక్ర వాహనంపై టెక్కలి మండలంలోని రావివలస గ్రామం వైపు వస్తుండగా పాలేశ్వరమ్మ గుడి సమీపంలో బైక్ అదుపు తప్పి బోల్తా పడింది. దీంతో బైక్‌పై ఉన్నటువంటి ఇరువురికీ తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే గాయపడినవారిని టెక్కలి జిల్లా ఆస్పత్రికి తరలించారు. అయితే సంజీవ్ పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్యం కోసం శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు. ఈ ఘటనపై సంతబొమ్మాళి పోలీసులకు సమాచారం అందించారు. అయితే వీరు వస్తున్న ద్విచక్ర వాహనానికి వెనుక నుంచి గుర్తు తెలియని వాహనం ఢీకొనడం వలన ప్రమాదం జరిగి ఉంటుందని పలువురు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.